## పట్వారీలతో ఇబ్బందులు పడేది..



జనగామ రూరల్, నవంబర్ 28 : గతంలో తండ్రి నుంచి కొడుకు పేరున భూమి మార్చాలన్నప్పుడు పట్వారీల పెత్తనంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. పనులు కాక పరేషాన్ అవ్వాల్సి వచ్చేది. కానీ, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో ఆ బాధలు లేకుండా చేశాడు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి భూసమస్యలకు చెక్ పెట్టారు. రైతు పేరున ఎన్ని ఎకరాలు ఉండాలో అన్ని ఎకరాల భూమి భద్రంగా ఉంటుంది. అలాంటిది కాదని కాంగ్రెసోళ్లు ధరణి రద్దు చేస్తామంటున్నారు. ధరణి తీసేస్తే మునుపటి రోజులొస్తాయి. మళ్లీ భూమి రిజిస్ట్రేషన్ల కోసం దళారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ధరణి రద్దు చేస్తామంటున్న కాంగ్రెసోళ్లకు అధికారం ఇవ్వొద్దు. రైతుల కోసం పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌కే అండగా నిలుద్దాం.

*- బండ వెంకటేశం, రైతు, పెంబర్తి గ్రామం, జనగామ మండలం*

## ఇప్పడే కరెంటు మంచిగొస్తుంది..



బచ్చన్నపేట. నవంబర్ 28 : ఇప్పుడైతే కరెంటు మంచిగొస్తుంది. గప్పుడైతే కరెంటు ఏపాటి ఇచ్చేదో అందరికీ తెలుసు. అబద్ధాలు అడడంలో నాటి పాలకులు ముందుంటరు. వాళ్లను నమ్మితే మనం గంగలో కలిసినట్టే. 3గంటలతో మళ్లు పారుతాయా.. తప్పు ఆలోచన. 3గంటలు కరెంట్ మాకెందుకు. 24గంటల కరెంటు వస్తేనే పంటలు మంచిగ పండుతయ్. అప్పటి రోజులు గుర్తుకు వస్తే వామ్మో గుండెల్లో దడ పుడుతది. వద్దు..వద్దు బాబు.. కరెంటు మంచిగిచ్చొటేళ్లు వస్తేనే బాగుంటది. ఇప్పుడైతే నిండుగా నీళ్లు ఉంటున్నయ్. కరెంటు మంచిగొస్తుంది. ఎవుసం మంచిగ చేసుకుంటున్నం. కాంగ్రెస్ మాటలు నమ్మితే రైతులకు ఇబ్బందులు తప్పవు. ఎవరు మంచి చేస్తున్నరో రైతులు ఆలోచించాలి.

*- బండి కనుకయ్య, లింగంపల్లి, బచ్చన్నపేట మండలం*





ప్రచారంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# సిద్దిపేటకు దీటుగా అభివృద్ధి చేస్తా

### ఇప్పలగడ్డ గ్రామ ప్రచారంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట, నవంబర్ 28 : జనగామ నియోజకవర్గాన్ని సిద్దిపేటకు దీటుగా అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పలగడ్డ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లను ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. దేవాదుల పునరుద్ధరణ గురించి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి పనులు చేపడుతామన్నారు. మిగిలిన పింఛన్లు, పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో చేయిస్తానని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందించామన్నారు. సంక్షేమ పథకం లేని ఇల్లు లేదని అన్నారు. ప్రజలంతా సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గానికి 12వేల ఇండ్లను మంజూరు చేయిస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. దశలవారీగా ఇండ్లను పూర్తి చేసుకుందామన్నారు. ఆసరా పింఛన్‌లు దశలవారీగా రూ.5వేలకు పెంచుకోబుతున్నామని తెలిపారు. 18ఏళ్లు నిండిన మహిళలకు సౌభాగ్యలక్ష్మి ద్వారా రూ.3వేలు అందిస్తామన్నారు. వచ్చే నెల నుంచి రూ.400లకే గ్యాస్ సిలిండర్ అందించేందుకు సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో రూపొందించారని అన్నారు. జనగామ నియోజకర్గ ప్రజలు ఎవరైనా తమ రేషన్‌కార్డు తీసుకొని నీలిమా హాస్పిటల్‌కు వెళ్తే పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందిస్తామని, అవసరమైతే ఉచితంగా ఆఫరేషన్లు చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ మూడోసారి కావడం ఖాయమని అన్నారు. సీఎం కేసీఆర్ కోసం 4వ నంబర్ కారు గుర్తుపై ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేశ్, సర్పంచ్ నీరేటి రాణీసుధాకర్, రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగరావు, నర్మెట, తరిగొప్పుల మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, గ్రామ అధ్యక్షుడు బండి రామలింగం, నాయకులు నీరేటి సుధాకర్, జంగిటి అంజయ్య, ఏర్పుల ఎబ్నేజర్, ప్రజ్ఞపురం అంజయ్య, బెడుదం సుధాకర్, మహేశ్వరం రాధాకృష్ణ, శశి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### 'పల్లా' గెలుపే లక్ష్యం..



ప్రచారం చేస్తున్న కేడీవైఏ సభ్యులు

బచ్చన్నపేట, నవంబర్ 28 : జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కృషి చేస్తున్నామని కట్కూర్ యువత వెల్లడించారు. మంగళవారం మండలంలోని కట్కూర్ గ్రామంలో కట్కూర్ డెవలప్‌మెంట్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వలబోజు సాయి, ఎనుగుల అశోక్, ముశిని బాబుగౌడ్‌లు మాట్లాడుతూ పల్లాతోనే జనగామ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధిస్తుందన్నారు. ప్రజలు కాంగ్రెస్ తప్పుడు ప్రచారం నమ్మకుండా పని చేసే దమ్మున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి కారుగుర్తుకే ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేకబొడ్డు రమేశ్, విశ్వరూపం, ముశిని రాజేశ్, లింగంపల్లి జగదీశ్, కోల అజయ్‌గౌడ్, శివ పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# కాంగ్రెస్ గాలి మాటలు

- సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి
- జనగామ నియోజకవర్గంలో మారిన రూపురేఖలు
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా
- రోడ్డుషోలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- హాజరైన మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, జడ్పీచైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి



బైక్ ర్యాలీలో పాల్గొన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : అబద్ధాలతో గ్లోబల్‌కు తోబుట్టువులా కాంగ్రెస్ గాలి మాటలతో చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జనగామ పట్టణంలో నిర్వహించిన రోడ్డుషోలో మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, జడ్పీచైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు ఏం చేయకుండా, ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయకుండా ఇక్కడికి వచ్చి గాలి మాటలు మాట్లాడితే సరిపోదన్నారు. 50ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఎందుకు పథకాలు ఇవ్వలేదని మండిపడ్డారు. కర్ణాటకలో సకల రంగాల సంక్షోభానికి కారమవుతున్న కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయేందుకు చైతన్యానికి అడ్డ అయిన తెలంగాణ గడ్డ సిద్ధంగా లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుండి పోరాడిన గడ్డ జనగామ ప్రాంతమన్నారు. ఇక్కడి పేదల జీవన విధానం మారాలని ఆనాడు పోరాటం చేస్తే, వారి సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అన్ని రంగాల్లో గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని, గ్రామ ప్రణాళిక ద్వారా ఏ ఊళ్లో ఏయే అవసరాలు ఉన్నాయో తెలుసుకుని ప్రాధాన్యతా క్రమంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, రవాణా తదితర రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. యువత కోసం జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేయడం సహా మెదక్, గజ్వేల్‌కు దీటుగా జనగామను అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. రంగప్ప చెరువు, బతుకమ్మ చెరువును అద్భుతంగా చేస్తానన్నారు. తెలంగాణ ఏర్పాటు తరువాత జనగామకు సాగునీరు, తాగునీరు తెచ్చుకున్నామన్నారు. ఇంకా ఎగువ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను నింపుకోవాల్సి ఉందని పల్లా చెప్పారు. జనగామ సాగునీరు, కాలువలు ఇంకా కావాలన్నా అన్ని తీసుకొస్తానన్నారు. పద్మశాలీలు చాలా మంది గుంట మగ్గాలతో నేస్తున్నారని, వారికి స్టాండ్ మగ్గాల ఇప్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. 30వేల ఎకరాల్లో సాగవుతున్న పామ్ ఆయిల్ కోసం పరిశ్రమ తెస్తామన్నారు. రైల్వే, జాతీయ రహదారుల లింక్ ఉన్న జనగామలో ఐటీ హబ్ తీసుకువస్తాని రాజేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు.

### రోడ్‌షోకు అపూర్వ స్పందన..

ప్రచార చివరి అంకం ముగిసే ఆఖరి గంటలో జనగామ పట్టణ వీధుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపు కోసం నిర్వహించిన రోడ్‌షోకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ప్రధాన కూడళ్లలో టీవీ ఫేమ్, ప్రముఖ కళాకారుడు బిత్తిరి సత్తితో కలిసి నిర్వహించి భారీ వాహన ర్యాలీ రోడ్‌షోకు వివిధ కాలనీల్లో ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు నిరాజనాలు పలికారు. వందలాది వాహనాలు, వేలాది మంది జనంతో కిలోమీటర్ పొడువునా సాగిన ర్యాలీ అనంతరం ఆర్టీసీ చౌరస్తాలో కార్నర్ సభ నిర్వహించారు.

### కాంగ్రెస్ అభ్యర్థి ఊసరవెల్లి..

2004లో గెలిపిస్తే ఆదివారం ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్న కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పచ్చకామెర్లు వచ్చిన వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లుగా మాట్లాడుతున్నాడని తెలిపారు. అందుబాటులో ఉండనని నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. మొదట టీఆర్‌ఎస్, తర్వాత వైసీపీ, బీజేపీ, ఇప్పుడు కాంగ్రెస్ ఇలా ఊసరవెల్లిలా పార్టీలు మారుతూనే ఉన్నాడని, ఆయన కండువాలు మార్చే తీరు ఊసరవెల్లి సిగ్గుపడేటట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఇన్ని జెండాలు, పార్టీలు మార్చిన వ్యక్తికి ఓటేస్తే జనగామ అభివృద్ధి జరగదని, పెద్ద సారు కేసీఆర్ దగ్గరకు పోయి.. పైసలు తెచ్చి పనులు చేస్తానని అన్నారు. గల్లా ఎగరేసుకొని జనగామ వాడినని చెప్పుకునేలా అభివృద్ధి చేసి చూపిస్తానని పల్లా తెలిపారు. ''ఈ ప్రాంతంలో ఇండస్ట్రీని నెలకొల్పుతా.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ తెచ్చుకుందాం, పామ్ ఆయిల్ ఇండస్ట్రీ, రైస్ ఇండస్ట్రీ , ఐటీ హబ్ తెచ్చే ప్రయత్నం చేస్తా, నర్సింగ్ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు చెచ్చుకుందాం'' అని పల్లా తెలిపారు.

### నీలిమ ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందిస్తాం..

రేషన్‌కార్డు పట్టుకుని ఘట్‌కేసర్‌లోని తన సొంత హాస్పిటల్ నీలిమకు వెళ్తే పైసా ఖర్చు లేకుండా అక్కడ వైద్యం ఉచితంగా అందిస్తారన్నారు. అవసరమైతే ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయిస్తానని చెపారు. ఖచ్చితంగా కారు గుర్తుకు ఓటేసి సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

కొమురవెల్లిలో మల్లన్న..జనగామలో పల్లాన్న ఫేమస్ అని..బీఆర్‌ఎస్ గెలుపు కోసం ఆఖరి సిక్స్ కొట్టడానికి వచ్చానని టీవీ ఫేమ్, ప్రముఖ కళాకారుడు బిత్తిరి సత్తి అన్నారు. మీ అందరిని పల్లా కడుపులో పెట్టుకొని చూసేందుకు వచ్చాడని, తెలంగాణ గడ్డకి పేరు తెచ్చింది సీఎం కేసీఆర్ అని స్పష్టం చేశారు. ఆశీర్వదించి అండగా నిలువాలని కోరారు.

# ముగిసిన ఎన్నికల ప్రచారం

### చివరి రోజు గ్రామాల్లో బైక్‌ర్యాలీ, ఇంటింటికీ ప్రచారం చేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు

జనగామ రూరల్, నవంబర్ 28 : నెల రోజుల నుంచి ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోరుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు సైనికునిలా నిరంతరం కృష్టపడ్డారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ఓట్లను అభ్యర్థించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతోపాటు కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత అందించే పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి పల్లాను గెలిపించాలని కోరారు. చివరి రోజు మంగళవారం గ్రామాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. నమోనా బ్యాలెట్‌తో ఓట్లు అడిగి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చీటకోడూర్‌లో శ్రేణులతో కలిసి ర్యాలీ తీస్తున్న సర్పంచ్ దీపక్‌రెడ్డి